క్లుప్తంగా

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు మరుగుదొడ్లు, మంచినీరు వంటి వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్కాలర్‌షిప్‌లు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు రాంచందర్, తిరుపతి, మారుతి తదితరులు ఉన్నారు.

సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సంతోష్

రెబ్బెన: మండల కేంద్రంలోని గురుకుల రెసిడెన్సీ పాఠశాల సమీపంలో మురికి నీరు నిల్వ చేరకుండా డీఎంఎఫ్‌టీ నిధులతో సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపడుతున్నామని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. శనివారం సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎగువన ఉన్న అటవీ ప్రాంతం నుంచి వచ్చే వరదనీటితో పాటు మండల కేంద్రంలోని ఇళ్లలో నుంచి వచ్చే మురికినీరు పాఠశాల సమీపంలో నిల్వ చేరి ఉండటంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. సమస్య దృష్టిలో పెట్టుకుని రూ. 5లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మాణ పనులు చేపట్టామన్నారు.

ఊట్‌పల్లిలో కార్డన్ సెర్చ్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని మారుమూల గ్రామం ఊట్‌పల్లిలో శనివారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు మాట్లాడుతూ యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు కన్పిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈజ్‌గాం ఎస్సై రమేస్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధి కోసమే కుట్రలు'

నేరడిగొండ: రాజకీయ లబ్ధి కోసమే ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు కుట్రలు చేస్తున్నారని గిరిజన లంబాడాల ఐక్య వేదిక (లైవ్) జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. తెలంగాణలో మణిపూర్ ఘటనలు సృష్టించేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. ఎంపీ స్థాయిలో ఉండి లంబాడాలపై విమర్శలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో లైవ్ మండల ఇన్‌చార్జి పాండు, మంగులాల్, కపిల్, రూప్‌చంద్, బీబీచంద్, రవీందర్, సోమేశ్వర్, రాజేశ్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: బ్రో
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: బ్రో

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.140
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	80
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	100
పాలకూర	60
సొరకాయ	60
చిక్కుడు కాయ	100
గోబి(పూల్)	100
క్యాబేజ	60

-ఆసిఫాబాద్‌అర్బన్

నివాసాల పక్కనే చెత్తాచెదారం

- దుర్గంధం వెదజల్లుతున్న వైనం
- ఇబ్బందుల్లో కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు



రాజంపేట్‌లో నివాసాల సమీపంలో పిచ్చి మొక్కలు



బాపునగర్‌లో నివాసాల పక్కన పేరుకుపోయిన చెత్త

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని నివాసాల మధ్య చెత్తాచెదారం పేరుకుపోతోంది. పలు కాలనీల్లోని ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాల్లో విపరీతంగా పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు ఇంట్లోని చెత్తాచెదారాన్ని పడేస్తున్నారు. దీంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో సమీపంలో నివాసం ఉండేవారు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో టీఆర్‌నగర్, బేస్తవాడ, బాపునగర్, రాజంపేట్, సందీప్‌నగర్, హడ్కోకాలనీ, మజీత్‌వాడ, ఎన్‌జీవో కాలనీల్లో నివాసాల పక్కనే చాలా వరకు ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి. ఆయా ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరుగుతుండడంతో రాత్రివేళల్లో విషపురుగులు బయటకు వస్తున్నాయని సమీపంలో ఉండే ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

విపరీతంగా పెరిగిన పిచ్చి మొక్కలు..

ఖాళీ స్థలాల్లో కంప చెట్లు, పిచ్చి మొక్కలు పెరగడంతో వర్షాకాలంలో విష పురుగులు ఇంట్లోకి వస్తున్నాయని రాజంపేట్, సందీప్‌నగర్ కాలనీవాసులు వాపోతున్నారు. ఈ కాలనీల్లో ఉన్న ఓపెన్ ప్లాట్లలో కంప చెట్లు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో సమీపంలో నివాసాలు ఉన్న వారు భయాందోళన చెందుతున్నారు. ఏ సమయంలో ఏ విషసర్పాలు సంచరిస్తున్నాయోనని భయంగా గడుపుతున్నారు. ఆయా స్థలాల యజమానులకు సమాచారం ఇచ్చి ఖాళీస్థలాలు శుభ్రం చేయించాలని వేడుకుంటున్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

గత కొన్ని రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేయడంతో పట్టణంతో పాటు పల్లెల్లో సైతం పారిశుధ్యం లోపించింది. డ్రెయినేజీలు శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. జిల్లాకేంద్రంలోని పలు కాలనీల్లో ఖాళీ రోడ్లపై, డ్రెయినేజీల్లో పెద్ద ఎత్తున చెత్త నిండి ఉండడంతో ఆయా కాలనీల ప్రజలు ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

పిచ్చి మొక్కలు తొలగించాలి



సందీప్‌నగర్‌లో మా ఇంటి పక్కనే ఖాళీ స్థలం ఉంది. వాటిలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో రాత్రిపూట విష పురుగులు బయటకు వస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉంది. పిచ్చి మొక్కలు తొలగించాలి.

- అనిల్, సందీప్‌నగర్

స్థలం యజమానిదే బాధ్యత

జిల్లా కేంద్రంలోని ఖాళీగా ఉన్న ఓపెన్ ప్లాట్లలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించాల్సిన బాధ్యత స్థలం యజమానిదే. యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరిమానా విధిస్తాం.

- వంశీ, పంచాయతీ కార్యదర్శి

తగ్గని వరద ఉధృతి



తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత పరవళ్లు

కౌటాల: మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతంతో పాటు జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది, తాటిపెల్లి, వీర్దండి గ్రామాలకు సరిహద్దులోని పెన్‌గంగ నది శనివారం వరద నీటితో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా మహారాష్ట్రలోని అప్పర్ వార్ధా ప్రాజెక్టు 16 గేట్లు, చంద్రపూర్ జిల్లాలోని ఇరాయి డ్యామ్ రెండు గేట్లను ఎత్తి అధికారులు దిగువకు నీటిని వదలడంతో నదులకు వరద గంటగంటకు పెరుగుతోంది. పెన్‌గంగ నది సరిహద్దు గ్రామాలైన తాటిపెల్లి, వీర్దండి గ్రామాల రైతుల పంట చేలు నీటమునిగాయి.

సరిహద్దు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కౌటాల: మండలంలోని ప్రాణహిత, పెన్‌గంగ నదుల సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సాయన్న అన్నారు. శనివారం మండలంలోని ప్రాణహిత నది వరద నీటిని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నదుల వైపు ఎవరూ వెళ్లొద్దని, నదుల వద్ద సెల్ఫీలు తీయవద్దని సూచించారు. ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎస్సై మధుకర్, ఆర్‌ఐ దిలీప్, కార్యదర్శులు సాయికృష్ణ, గణేశ్, సందీప్ ఉన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: భారీ వర్షాలకు మండలంలోని గూడెం వద్ద అంతరాష్ట్ర రహదారిని తాకుతూ శనివారం వరద ఉప్పొంగి ప్రవహించింది. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అందజేత



బ్యాగ్ అందజేస్తున్న డీఎం శ్రీధర్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు బ్యాగ్ పోగొట్టుకోగా ఆర్టీసీ సిబ్బంది వెతికి పట్టుకొని తిరిగి బాధితుడికి శనివారం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసిన ఓ ప్రయాణికుడు విలువైన వస్తువులతో కూడిన బ్యాగు పోగొట్టుకొన్నాడు. బ్యాగ్‌లో ఫోన్‌తో పాటు రూ.1500 వరకు ఉన్నాయి. బాధితుడు చరవాణి ద్వారా శనివారం ఉదయం డిపో మేనేజర్ శ్రీధర్‌కు సమాచారం అందించారు. సత్వరమే స్పందించిన డీఎం సిబ్బందికి ఆదేశాలు జారీ చేయగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ జోసెఫ్ బ్యాగును వెతికి అధికారులకు అందజేశారు. అనంతరం డిపో మేనేజర్ ఆదేశానుసారం సిబ్బంది బాధితుడికి బ్యాగ్ అందజేశారు.

పులుల సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌ఎస్‌వో

పెంచికల్‌పేట్: అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కమ్మర్‌గాంలో ఎఫ్‌ఎస్‌వో జగన్‌మోహన్ గౌడ్ శనివారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పులుల సంరక్షణకు గ్రామస్తులు సహకరించాలన్నారు. వాటి ఆవాసాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా కృషి చేయాలని కోరారు. మురళీగూడ అటవీ ప్రాంతంలోని ముసలమ్మ గుట్ట ఆలయం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



సిర్పూర్ (టి): అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిర్పూర్(టి): అడవుల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని సిర్పూర్(టి) రేంజ్ ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్ అన్నారు. మండలంలో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అడవుల సంరక్షణతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు.అనంతరం పులులు, అడవుల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చీలపెల్లి సర్పంచ్ యాదగిరి బ్రహ్మయ్య, ఎఫ్‌ఎస్‌వోలు వల్క మోహన్, బీట్ అధికారులు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తాత్కాలిక కార్మికులను అడ్డుకుంటున్న నాయకులు

రెబ్బెన: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. శనివారం మండలానికి వచ్చిన పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఉదయం రెబ్బెన పంచాయతీలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కార్మికులు పనులు చేయకుండా జేఏసీ నాయకులు అడ్డుకున్నారు. నాయకులు సుధాకర్, వెంకటి, శంకర్, దేవాజీ, ప్రకాష్, బాబాజీ, శ్రీనివాస్, లక్ష్మి, శోభ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: జీపీ కార్మికుల నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం కార్మికులు కళ్లు మూసుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి వెట్టిచాకిరి చేస్తున్న కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమ్మెలో కార్మికులు నగేశ్, బానిత్, రాజారం, లింగయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రవీందర్

రెబ్బెన: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, సీపీవో రవీందర్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలపై అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో వెంకటేశ్వరస్వామి, ఏపీఎం రాజ్‌కుమార్, ఏపీవో బుచ్చన్న, ఎంపీవో అంజద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మోతిరాం

కెరమెరి: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు 9న ఘనంగా జరుపుకోవాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం అన్నారు. శనివారం మండలంలోని హట్టి బేస్ క్యాంపులో ఆదివాసీ సంఘాలు, నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఉదయం 10 గంటలకు హట్టి నుంచి జోడేఘట్ వరకు బైక్ ర్యాలీతో వెళ్లి కుమురం భీం విగ్రహానికి నివాళులర్పించడంతో పాటు సమాధికి పూజలు చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌లు న్యానేశ్వర్, జగన్నాథ్‌రావు, వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు కోవ ఇందిరా, ఆత్రం బొజ్జిరావు, మడావి రఘునాథ్, సోము, రాజేశ్వర్, దుందేరావు, దంబిరావు, భరత్, చందన్‌శావ్, రామారావు, అంబారవు, తుకారాం తదితరులు ఉన్నారు.

ఎస్టీ హోదా కల్పించాలి

ఆదిలాబాద్‌రూరల్: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విన్నవించడానికి అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాలీ నేతలు శనివారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు విజయ్ వాడగురే, శెండే గంగారం, నారాయణ శెండే, మేంగాజీ గురునులే, కావుడే తులసిరామ్, కావుడే దత్తు, శివరాం నాగోశే, హుస్సేన్ పెట్కులే, దేవిదాస్ వాడగురే పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



రెబ్బెన: పుంజుమేరగూడలో పీర్ల వేడుకలు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ వీధుల గుండా పీరీలు ఊరేగించారు. పీరిల వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలోని అనేక చోట్ల మొహర్రం పండుగ పురస్కరించుకుని భక్తులకు షర్బత్ పంపిణీ చేశారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మొహర్రం పండుగ పురస్కరించుకుని గ్రామాల్లో ప్రతిష్టించిన పీర్ల సంబరాలు శనివారంతో ముగిశాయి. గత తొమ్మిది రోజులుగా గ్రామాల్లో పీర్ల సంబరాలుతో సందడి నెలకొనగా శనివారం ఉదయం పీర్లపై కత్తిదెబ్బ వేయటంతో వేడుకలు ముగిశాయి. రాత్రి డప్పుచప్పుళ్లతో పీర్లను గ్రామాలకు సమీపాన ఉన్న చెరువుల్లో నిమజ్జనం చేశారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: మొహర్రం పండుగను శనివారం జిల్లా కేంద్రంలో అత్యంత వైభవంగా జరుపుకున్నారు. పట్టణంలోని పొట్టిశ్రీరాములుచౌక్, హడ్కో కాలనీ, మజీద్‌వాడీ, బజార్‌వాడీ, కంచుకోట, జన్కాపూర్, తదితర కాలనీల్లో పీరీల బంగ్లాలను ఏర్పాటు చేశారు. పండుగ పురస్కరించుకుని పీరీలు పట్టణంలో ప్రదర్శన నిర్వహించిన అనంతరం స్థానిక పెద్దవాగులో నిమజ్జనం చేశారు. మండలంలోని చిర్రకుంట, తుంపసల్లి, గుండి, ఈదులవాడ, గోవింద్‌పూర్ కోసార, బేరుగుడ, మోతుగుడ, గ్రామాల్లో సైతం వేడుకలు నిర్వహించారు. నాయకులు సల్మాన్ ఖాన్, పాషా, రాశీఫ్ హష్మీ, షాబాజ్, కైఫ్‌పా, అయిమాన్, తమీమ్, సమీర్, సాయి పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలో శనివారం పీర్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. కెరమెరిలోని ఎస్సీ కాలనీతో పాటు బేల్దార్‌గూడలో 9రోజులపాటు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పీరీలను ప్రతీ వాడలో ఊరేగించారు.



రెబ్బెన: షర్బత్ పంపిణీ చేస్తున్న నాయకులు



ఆసిఫాబాద్‌అర్బన్: గొడవల్లిలో ..

షర్బత్ పంపిణీ

మండల కేంద్రంలో శనివారం మొహర్రం పర్వదినం సందర్భంగా వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎంపీటీసీ ఇష్తేకార్, మాళి హైదర్, సదర్ యూసూఫ్, ధనోరా ఉపసర్పంచ్ రిజ్వాన్‌లు ప్రజలకు షర్బత్ పంపిణీ చేశారు. ఇమామ్ హుస్సేన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు 72 మంది షహీద్ అయిన సందర్భంగా షర్బత్ పంపిణీ చేస్తారని పెద్దలు తెలిపారు.

క్రీడాభివృద్ధికి కృషిచేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: క్రీడాభివృద్ధికి కృషి చేయాలని నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్, కార్యదర్శి తిరుపతి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జనరల్ బాడీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ విక్రమాదిత్యరెడ్డి, కార్యదర్శి ఖాజాఖాన్‌ను శాలువాతో సత్కరించారు. క్రీడాపోటీలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

అభివృద్ధికి దూరంగా ఆదివాసీ గ్రామాలు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయని టీపీసీసీ ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ పుర్కబాపురావు అన్నారు. శనివారం ఉట్నూర్ మండలంలోని దొంగచింత, భీంజీగూడ, సోనాపూర్, కుమ్మరికుంట గ్రామాల్లో పర్యటించారు. కోతకు గురైన రోడ్లు, గుంతలను పరిశీలించారు. ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు విడుదల చేస్తున్నా.. ఎలాంటి అభివృద్ధి జరగడం లేదన్నారు. ఆయన వెంట నాగాపూర్ సర్పంచ్ సునీల్ ఉన్నారు.

పచ్చని అడవిలో ప్రకృతి జలపాతం



వాంకిడి మండల కేంద్రం నుంచి 9 కి.మీల దూరంలో ఉన్న బుగ్గ జలపాతం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ఈ జలపాతాన్ని సందర్శించడానికి వాంకిడి నుంచి ఖమాన గ్రామం మీదుగా సర్కేపల్లి చేరుకోవాలి. అక్కడి నుంచి కాలినడకన సుమారు 2 కి.మీలు వెళ్లాల్సి ఉంటుంది. వర్షాకాలంలో పరవళ్లు తొక్కుతున్న ఈ జలపాతం ఇతర కాలాల్లోనూ ప్రకృతి అందానికి ప్రతీకగా నిలుస్తుంది. సహజ సిద్ధంగా ఏర్పడే ఈ జల ధార వద్ద ఆదివాసీలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. అధికారులు దృష్టి సారించి జలపాతం వరకు రోడ్డు మార్గం నిర్మిస్తే పర్యాటకుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

- వాంకిడి

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ఇంటి పరిసరాలు పరిశీలిస్తున్న డీటీడీవో

తిర్యాణి: ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీటీడీవో, మండల విపత్తు ప్రత్యేక అధికారి రమాదేవి అన్నారు. శనివారం మండలంలోని లింగిగూడ గ్రామంలో ఆమె పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలో తహసీల్దార్ అనంతరాజుతో కలిసి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏటీడీవో క్షేత్రయ్య, ఆర్‌ఐ శర్వాణి, సీఆర్‌పీ యశ్వంత్‌రావు తదితరులు ఉన్నారు.